# క్రమశిక్షణను పాటించండి

ఇంద్రియంబుల మనసు నిలిపిన అంధుడైనను ముక్తి పొందును
ఇంద్రియంబుల నిగ్రహించని చంద్రుడైనను పతనమొందును
కన్ను విప్పి చూడరోరన్నా
ఈ సాయి దేవుడు ఎన్నగా ఎందైన కలడన్నా
మున్ను షిరిడి నేడు పర్తి ఉన్నవాడని పేరెగాని
తన్ను భావన చేయు భక్తుల కన్నులందే మెలగురోరన్నా
కన్ను విప్పి చూడరోరన్నా!

విద్యార్థులారా!

భారతీయ సాంప్రదాయమునందు ధర్మ, అర్థ, కామ మోక్షములనే చతుర్విధ పురుషార్థములు మానవునకు అత్యంత ప్రధానము. కాని వీటిని సర్వ మానవులు అనుసరించుటకు, ఆనందించుటకు తగిన శక్తి సామర్థ్యములు లేకపోవచ్చును. మానవునకు ప్రధానమైన చతుర్విధానములున్నవి. వాటిని సక్రమముగా అర్థము చేసుకొనుటకు ప్రయత్నించినప్పుడే ధర్మార్థ కామ మోక్షములు కూడను సులభముగా ఆచరించుటకు వీలవుతుంది. ఇప్పటి విద్యార్థులకు ఇవి చాలా అవసరము. వీటిని అర్థము చేసుకున్నప్పుడే సమస్తాన్ని కూడను వీరు అర్థము చేసుకోగలరు. వీటిని అర్థము చేసుకోలేకపోవటం చేత అనేక రకములైన అనర్థములు ప్రవేశించి మానవుని యదార్థమును మరచిపోతున్నారు. మొదటిది మైత్రి. రెండవది కరుణ. మూడవది ముదిత. నాలుగవది ఉపేక్ష. ఇదే ప్రతి మానవునకు అత్యవసరమైన, ప్రధానమైన చతుర్విధాలైన ధర్మములు. ఐతే వీటికి తగిన అర్థములు చెప్పేవారు లేకపోవటం చేతను, చింతించే శక్తి సామర్థ్యములు లేకపోవటం చేతను, మైత్రి అనగా ఒక విధమైన friendship అని ఒక విధమైన స్నేహమని మాత్రము భావిస్తున్నారు.

srisathyasaivachanamrutam

స్నేహమంటే ఏమిటి? ఎవరితో స్నేహము చెయ్యాలి, ఎట్లా చేయాలి అనే సత్యాన్ని మొత్తము విచారించాలి. అందరితోను స్నేహము చేయకూడదు. తనకు సరియైన సమానత్వాన్ని గుర్తించే స్నేహము చెయ్యాలి. తన వయసుకు, తన సంపదకు తన ఆరోగ్యమునకు, తన చదువుకు, తన పరిస్థితికి తగినవారితోనే స్నేహము చెయ్యాలి. అధికులతోగాని, చిన్నవారితోగాని స్నేహము చేయకూడదు. ఇది స్నేహమునకు సరియైన అర్థము. అధికులతో స్నేహము చేసినప్పుడు అతను నిన్ను లొంగదీసుకొనుటకు ప్రయత్నించవచ్చు. దీనికి విరుద్ధము జరిగినప్పుడు నీ స్నేహమునకు భంగము కలుగవచ్చు. చిన్నవారితో స్నేహము చేసినప్పుడు నీవు వాళ్లను అదుపులో పెట్టుటకు ప్రయత్నించవచ్చును. వాడు దానికి అంగీకరించకుండా పోయినప్పుడు తిరిగి ఈ స్నేహము భిన్నము కావచ్చును. కనుకనే వయస్సు, స్థితి, సంపద, విద్య ఇలాంటి పరిస్థితులు సమానముగా ఉండినవారితో స్నేహము చేసినప్పుడే అది శాశ్వతమైన స్నేహముగా రూపొందుతుంది.

ఇంక కరుణ. ఈ కరుణను ఇష్టము వచ్చినట్లుగా మనము ప్రసరింప చేయకూడదు. మనకంటె చిన్నవారిపైన కరుణను చూపాలి. వయసునందు, సంపదయందు, దేహమునందు, చదువునందు ఇంక పరిస్థితులయందు కూడను మనకంటె తక్కువస్థాయి యందు ఉండినవారి పైననే మనము కరుణ చూపాలి. అప్పుడే ఈ కరుణకు విలువ అధికమవుతుంది. కరుణయొక్క స్థాయి కూడను బలపడుతుంది.

ఇంక ముదిత. ముదిత అనగా అనేకమంది మనకంటే కొంత అధికముగా ఉంటుంటారు. ఈ అధికులను చూసి మనము ఆనందించాలి. మనకంటే ఆరోగ్యముతో చక్కగా ఉండిన వ్యక్తిని చూసినప్పుడు మనము ఆనందించాలి. మనకంటె అధిక సిరిసంపదలతో కూడిన వారిని చూసి మనము ఆనందించాలి. మనకంటె అధికస్థానములో ఉన్న అధికారులను చూసి మనము ఆనందించాలి. మనకంటె ఉత్తమమైన మార్కులను అందుకొనే వ్యక్తిని చూసి మనము ఆనందించాలి. కనుక ముదిత అంటే మనకంటె అధికులను చూసి అసూయ పడకుండా ఇంకే విధమైన దుర్భావములను ప్రవేశ పెట్టకుండా ఆనందించేటటువంటిదే.

ఇంక ఉపేక్ష. అపేక్ష ఉపేక్ష అంటారు. అపేక్ష అంటే ఇష్టపడటం. ఉపేక్ష అంటే

ఇష్టపడకుండా పోవటము. చెడ్డ చేసేవారిని మనము ఏమాత్రము ఇష్టపడకూడదు. ఇతరులకు కీడు చేసేవారిని చూసినప్పుడు మనము ఇష్ట పడకూడదు. దుర్బుద్ధులతో దురాలోచనలతో, దుష్ప్రవర్తనతో, దుశ్చింతలతో మెలిగే వ్యక్తులను చూసి మనము ఏమాత్రము కూడను స్నేహముగా తీసుకోకూడదు అంగీకరించకూడదు. దుర్గుణములు దురాలోచనలు దుష్ప్రవర్తనలు కలిగిన వారిని మనము ఏమాత్రము ఇష్టపడకూడదు. ఈ నాల్గింటిని మనము చక్కగా ఆచరణలో పెట్టినప్పుడు ఇంతకంటె గొప్ప పురుషార్థములు మరొకటి లేవు. సరి సమానమైన వానితో స్నేహము చేయటము, తక్కువ వానిపైన కరుణ చూపటము, ఎక్కువ వాని ఆధిక్యము చూసి ఆనందించటము, దోషులను చూసి దూరముగా ఉండటము ఈ నాలుగే నిజమైన పురుషార్థములు.

ఈ పురుషార్థములలో మనము చక్కగా సక్రమముగా ప్రవర్తించటం లేదు. కనుకనే మనయొక్క స్థితిగతులు దిగజారి పోతుండాయి. విద్యార్థిగాని లేక మరొక వ్యక్తిగాని తాను ధరించే దుస్తులుగాని, తాను ధరించే నగలుగాని తాను తన దేహమునుగాని నిరంతరము పరిశుద్ధముగా ఉంచుకొనుటకు ప్రయత్నించాలి. ఇది బహిశ్శౌచము. ఇంత మాత్రం కాదు. మన చిత్తము కూడను శుద్ధి గావించుకోవాలి. మన భావములను పరిశుద్ధి చేసుకోవాలి. కనుకనే అంతర్బహిః పరిశుద్ధి అనేటువంటిది. ఈ అంతః పరిశుద్ధిని మనము ఏరీతిగా గావించుకొనవచ్చు బయట ఉన్న మాలిన్యాన్ని కడుక్కోవచ్చు, తుడుచుకోవచ్చు. కాని లోపల ఉన్న మాలిన్యాన్ని మనము ఏ రీతిగా తెలుసుకోగలము? ఏ రీతిగా చూడగలము? ఏ రీతిగా దీనిని పరిశుద్ధము చేయగలము?

**భగవంతుడే అన్నింటియందు ఉన్నాడు**

దీనికి సరియైన మార్గము ఒక్కటే ఒక్కటి. ప్రతి జీవియందు ప్రతి ప్రాణియందు క్రిమికీటకాదులు మొదలుకొని సర్వప్రాణులయందు ఉన్నది భగవంతుడే అనే విశ్వాసాన్ని మనము అభివృద్ధి పరచుకుంటే ఈ చిత్తశుద్ధి కలుగుతుంది. ఈశావాస్యం అన్నిటియందు వసించినవాడు భగవంతుడే. ఈ సత్యాన్ని మనము చక్కగా గుర్తించి వర్తించినప్పుడే మనము చిత్తశుద్ధి గావించుకొన్న వారమౌతాము. అఖండ సచ్చిదానంద స్వరూపమైన దివ్యత్వము

srisathyasaivachanamrutam

సర్వత్రా ఉంటున్నాది. అందులో ఏది మంచిదని ఏది చెడ్డదని ఎవరు నిర్ణయించగలరు? ఒకవేళ ఇది మంచి ఇది చెడ్డదని నిర్ణయించటానికి పూనుకున్నప్పుడు దీనికి ఏదో రెండవ పదార్థము ఒకటి ఉండినప్పుడే మంచి చెడ్డ అని నిర్ణయించుటకు సాధ్యమవుతుంది. రెండవ పదార్థము ఇక్కడ లేదే. కనుక దేనిని మంచి దేనిని చెడ్డ అని నిర్ణయించటానికి వీలౌతుంది. ఈ విధముగా విచారణ చేసినప్పుడు రెండవ పదార్థము ఒకటి ఉన్నదని అజ్ఞానులు భావిస్తుంటారు. అదే దేహాభిమానము. ఈ దేహమనేది రెండవది ఉన్నది అనుకున్నప్పుడే ఇది చెడ్డది అది మంచిది అనే మంచి చెడ్డ నిర్ణయానికి ప్రవేశిస్తాడు. కాని దివ్యత్వాన్ని మంచి చెడ్డలని చెప్పటానికి ఎవరికి సాధ్యము కాదు. ఎవరు నిర్ణయించలేరు.

ఒక చిన్న ఉదాహరణము. ఒక మట్టి పాత్ర ఉంటుండాది. చెక్క పాత్ర ఉంటుండాది. కాపర్ పాత్ర ఉంటుండాది. ఇత్తడి పాత్ర ఉంటుండాది. వెండిపాత్ర ఉంటుండాది. ఈ అన్ని పాత్రల నిండుగా నీరు పెట్టినప్పుడు అని పాత్రలయందు ఒకే సూర్యుడు వెలుగుతున్నాడు. ఏ పాత్రలో ఉండిన సూర్యుడు చెడ్డవాడని, ఏ పాత్రలో వుండిన సూర్యుడు మంచివాడని నీవు ఎట్లు నిర్ణయించగలవు? పాత్రలకు తగిన విలువను నీవు అందించవచ్చు. ఈ మట్టిపాత్ర చాలా తక్కువ వెల, ఈ బంగారు పాత్ర ఎక్కువ వెల. ఈ విధముగా దానికి వెలనందించటానికి సాధ్యమవుతుందేగాని ఇందులో కనిపించే ప్రతిబింబమైన సూర్యునికి ఏవిధముగా వెలనందించటానికి, ఏ విధముగా మంచిచెడ్డలు నిర్ణయించటానికి సాధ్యమవుతుంది?

ఇక్కడ మంచి చెడ్డ ఏమిటి? పాత్రలు ప్రకృతికి సంబంధించినవి. ఈ సూర్యుడు పారమార్థికమైన సంబంధము. కనుకనే పాత్రలు చెడ్డవి. సూర్యుడు మంచివాడు. సూర్యుడు అనంతమైన ప్రేమ సముద్రము. జీవుడు ప్రేమస్వరూపుడు. ఈ పాత్రనే లేక నీరు నిలువలేదు. నీరే లేకుండిన సూర్యుని ప్రతిబింబాన్ని మనము చూడలేము. కాబట్టి సూర్య ప్రతిబింబాన్ని దర్శించటానికి పాత్ర మనకత్యవసరము. ఈ పాత్ర లోపల జలము కూడను అవసరమే. ఈ జలమే మనస్సు. ఈ పాత్రనే మన దేహము. ఇందులో ప్రతిబింబించే సూర్యుడే మన ఆత్మ. కనుక అందరియందు ఉండిన ఆత్మఒక్కటేగాని ఇందులో భేదములు పాత్ర భేదములు మాత్రమే. ఉపాధి భేదములు మాత్రమే. ఈ విధముగా మనము విచారము చేయటానికి పూనుకున్నప్పుడు

srisathyasaivachanamrutam

ప్రతి ఒక్క దోషముకూడను దేహము మనస్సులతోనే ఏర్పడుతున్నాది. కొన్ని పాత్రలలో మలినమైన జలము ఉండవచ్చును. కొన్ని పాత్రలయందు చంచలముగా కదిలే జలము ఉండవచ్చును. కొన్ని పాత్రలయందు పరిశుద్ధమైన జలము ఉండవచ్చును. పరిశుద్ధ జలములో కనిపించే సూర్యుడు సాత్వికమని, చలించే జలములో కనిపించే సూర్యుడు రాజసికమని, మలినమైన జలములో కనిపించే సూర్యుడు తమోగుణమని నీవు నిర్ణయించుకోవచ్చు. కనుక మనము ఈనాడు పరిశుద్ధము చేసుకోవలసినది ఏమిటి? మనము ఈ రజోగుణము, తమోగుణములనే చంచలత్వ మాలిన్యములు లేకుండా మనస్సును పరిశుద్ధము చేసుకోటానికి తగిన కృషి చేయాలి. ఇది ఏ రీతిగా పరిశుద్ధము చేయవలెను? ఏ రీతిగా నిశ్చలత్వాన్ని సాధించాలి? ఈ నిశ్చలత్వమునకు నిర్మలత్వమునకు మనము చేయవలసిన సాధన ఏమిటి?

**మనస్సును నిర్మలంగా ఉంచుకోండి**

ఈనాడు మానవుడు తన దోషములను తాను కప్పిపుచ్చుకోటానికి ప్రయత్నిస్తున్నాడు. పరుల దోషములను వెదకటానికి ప్రయత్నిస్తున్నాడు. ఈ రెండుగుణములు ఉండినంతవరకు ఇతని హృదయము ఏమాత్రము పరిశుద్ధము కాదు. ఇట్టి మానవునకు నిశ్చలత్వము ఏమాత్రము ప్రాప్తించదు. తనయందున్న దోషములను ఇతరులయందున్న మంచిని గుర్తించటానికి ప్రయత్నించినవాని హృదయమే పరిశుద్ధము, పవిత్రము, నిశ్చలము అవుతుంది. కానీ ఈనాటి మన ప్రయత్నములన్ని భౌతికమైనవి, ప్రాకృతమైనవి, ఆడంబరమైనవిగను ఆచరిస్తున్నాము. ఈ ఆడంబరమే మానవుని అధః పతనము గావిస్తుండాది. ఎన్ని విధముల ప్రయత్నము చేసినప్పటికీ ఆత్మతత్త్వాన్ని మనం అర్థము చేసుకోలేకపోతున్నాము.

ఒక విద్యార్థి చెప్పాడు స్వామి తత్త్వము అర్థము చేసుకోవటం కష్టమైనప్పటికిని దానిని మనము అనుసరించినప్పుడు ఆ ప్రాప్తిని మనం పొందవచ్చును అన్నాడు. అయితే ఇది పొందటానికి తగిన మార్గమేది? స్వామికిని మీకును ఉండిన సంబంధ బాంధవ్యము లోపల ఏదో ఒక తప్పు ఉన్నదని ఆ విద్యార్థి చెప్పాడు. ఈ దోషము ఎక్కడ ఉంటున్నాది? అనేకమంది అనేక రకములుగా భావించవచ్చు ఊహించవచ్చును. నీవు ఎలాంటి పరిస్థితియందు ఉండినప్పటికిని దానిని నీవు గ్రహించి సహించి దానిని సాధించే ఉపాయానికి ప్రయత్నించాలి.

sri sathyasai vachanamrutam

అట్లు కాకుండా నీలోనే దోషములు అభివృద్ధి గావించుకుంటూ వస్తే ఎలాంటి ప్రదేశములో ఉండినప్పటికిని, ఎలాంటి సంఘములో ఉండినప్పటికిని ఎలాంటి దివ్యమైన మందిరములయందు ఉండినప్పటికిని ఇది ఏమాత్రము వీలుకాదు. ఎన్ని దోమలు ఉండినప్పటికిని ఆ దోమలున్న గదిలో దోమతెర కట్టుకుంటే ఈ దోమల బాధ మనకు ఏమాత్రము ఉండదు. దోమలు ఉండినప్పటికిని దోమతెర కట్టుకున్నప్పుడు మనకు బాధ ఉండదు. కాని దోమ తెరలోనే దోమలుంటే దీని ఎవరు సాధించటానికిగాని, తప్పించటానికిగాని సాధ్యము కాదు. అదేవిధముగానే మీరు దోమతెరలో దోమలు చేర్చుకున్నారు. దోమతెర ఎందుకోసం కట్టుకున్నావు. దోమల నుండి తప్పించుకునే నిమిత్తమై దోమతెర కట్టుకుని ఆ దోమలను దోమతెరలోనే పెట్టుకుంటే ఎవరి దోషము? కనుక మనము చేసే విధి విధానములో విజ్ఞాన ప్రజ్ఞానములు లేకుండా మనం ప్రవర్తిస్తున్నాము. అందరికి భక్తి ప్రపత్తులు ఉండవచ్చును. స్వామి అంటే చాలా ప్రేమ ఉండవచ్చును. కాని ప్రేమ ఉండినంత మాత్రమున చాలదు. ప్రవర్తన అత్యవసరము. అట్టివారికి భగవత్తత్వాన్ని చక్కగా గుర్తించుకున్నప్పుడే దీన్ని సరైన మార్గములో ఉంచుకోటానికి వీలవుతుంది.

మనము రోడ్డులో ప్రయాణమై పోతుంటాము. రోడ్డు ప్రక్క పెద్ద వృక్షము ఉంటుండాది. ఈ వృక్షమంతా చక్కగా కళకళలాడుతూ ఉంటుంది. చక్కని జీవకళతో ఉట్టి పడుతుండాది. మరొక ప్రక్క చిన్న వరిపైరు ఉంటుండాది. రెండు దినములు నీరు కట్టకుండా పోవటంచేత వరి పైరంతా ఎండిపోయినట్టుగా కనిపిస్తుండాది. అంత పెద్దచెట్టు ఇంత పచ్చగా కళకళాలాడటమేమిటి, ఈ చిన్నపైరు ఒక్క దినం నీరు లేకపోవటం చేత ఈ విధముగా కృంగిపోవటం ఏమిటి? దీని అంతరార్థమును మనము చక్కగా విచారణ చేసినప్పుడు ఈ పెద్ద వృక్షము వేర్లు నీటిమట్టము వరకు దిగిపోయినాయి. దానివల్ల దీనికి ఏమాత్రం చింత లేకుండా చక్కగా కళకళలాడుతుండాది. ఈ చిన్నపైరు వేర్లు నీటిమట్టం వరకు దిగలేదు. కాబట్టి ఇది పైపైనే ఎండి పోతుండాది అని తెలుస్తుంది. ఎవరి మనస్సు హృదయం వరకు దిగుతుండాదో వారి జీవితం కళకళలాడుతుంది. కిలకిల నవ్వుతుంది. ఎవరి మనసు భగవంతుని ప్రేమవరకు చేరకుండా ఉంటుంటాదో వారి జీవితము విలవిల తన్నుకుంటుంది. మలమల మాడుతుంది. కనుక ఈ ఆనందమునకు, ఈ దుఃఖమునకు ఉండిన కారణము ఏమిటి? మనం చెప్పిన

srisathyasaivachanamrutam

మాటలను చర్యలలో చూపకుండా ఉండటానికి కారణమేమిటి? మన మనస్సు అంతలోతుగా దిగిపోలేదు. కేవలము పైపైనే ఉంటుండాది. వేర్లు కూడా ఉన్నాయో లేదో చెప్పటము కష్టము.

భరతుడు కేకయ రాజ్యము నుండి అయోధ్యకు వచ్చాడు. వచ్చి తండ్రి మరణవార్త విన్నాడు. ఈ మరణమునకు కారణమేమని తల్లిని ప్రశ్నించాడు. ఆమె ఒక గొప్ప ఘనకార్యము చేసినట్టుగా నాయనా దీనికి నేనే కారణము. నీకు రాజ్యము నిచ్చి నిన్ను ఉన్నత స్థాయికి చేర్చే నిమిత్తమే నేను ఈ కోరిక కోరినాను. అప్పుడు చింత చేత మీ నాన్నగారు మరణించారన్నది. తన దృష్టికి, తన భావమునకు అది ఘనముగ ఉండవచ్చును. కాని భరతుని మనసుకు అది కఠినముగా కన్పించింది. 'క్రూరురాలా! చెట్టును కొట్టి కొమ్మను నాటటం ఏమైనా బుద్ధితనమా?' అన్నాడు. అదేరీతిగా దైవత్వమనే దాన్ని మీరు త్రుంచుతున్నారు. ప్రకృతి తత్త్వమనే కొమ్మలు నాటి చూపిస్తున్నారు. భరతుడు కైకను ఇంకా ఏ విధముగా నిందించాడో తెలుసునా? 'సూర్యవంశము కీర్తిని నిలబెట్టటానికి వచ్చిన దానవు కాదు. సూర్యవంశపు కీర్తిని శూన్యము గావింపవచ్చిన దానవు నీవు' అన్నాడు. అదేవిధముగనే మనము భక్తులము, భక్తులమని వస్తున్నాము. భక్తి ప్రపత్తులు నిలబెట్టే నిమిత్తమై మనము వస్తున్నామా లేక స్వార్థ స్వప్రయోజనముల నిమిత్తమై వస్తున్నామా అనే విషయాన్ని మనం విచారిస్తే నీకు నీకే జవాబు దొరుకుతుంది.

**రసోవైసః**

ఈనాటి విద్యావిధానము లోపల అనేక మార్పులు కలుగుతున్నాయి. కాని ఈ మార్పులన్నీకూడను ఎక్కడకు కొనిపోతున్నాయి? మానవత్వాన్ని పతనము గావించే స్థానమునకు గొనిపోతున్నాయి. మన ప్రాచీన సంప్రదాయమంతా హస్యాస్పదంగా చూస్తున్నాము. మన శాస్త్రములు, మన ధర్మములు అమాయకులైన ప్రజలను మోసగించే నిమిత్తమై ఏర్పడిన తంత్రములుగా భావిస్తున్నారు. చాలా పొరపాటు చాలా పొరపాటు. ప్రాచీన సాంప్రదాయములు, ప్రాచీన సదాచారములు, ప్రాచీన ధర్మములన్నీ కూడను మానవోద్ధరణ నిమిత్తమై ఏర్పడినవి. మానవత్వాన్ని మహితత్వంగా మార్చే నిమిత్తమై ఏర్పడినవి. ఈనాటి విద్యావిధానములో పరిశోధనలు అధికమై పోతున్నాయి. ప్రత్యక్ష ప్రమాణాన్ని ఆశిస్తున్నారు. ప్రతి ఒక్కటి పరిశోధన

srisathyasaivachanamrutam

చెయ్యాలి. ఇందులో ప్రత్యక్షము మనకు చాలా ప్రమాణము. ప్రత్యక్ష ప్రమాణమునకు లొంగనిది మనము ఏమాత్రము విశ్వసించకూడదు. ఈ విధమైన సిద్ధాంతములలో గ్రుడ్డిమానవులు మునిగిపోతున్నారు. మూర్ఖ జీవులు దీనినే విశ్వసిస్తూ వస్తున్నారు. ఈనాటి పరిస్థితి, ఈనాటి వాతావరణము ఈ విధమైన స్థితిగతులలో చిక్కుకొని ఉంటుండాది. నిజమే ప్రత్యక్ష ప్రమాణము అత్యవసరమే. కాని భారతీయ సంస్కృతి యందు కేవలం రూపము మాత్రమే కాదు దానికి సాధన కూడా ఉంటుండాలని బోధిస్తూ వచ్చింది. దానినే ఉపనిషత్తులు 'రసోవైసః' రస స్వరూపమనేది లేకుండా ఇదంతా నీరసమేను అని. మీరు చూడవచ్చును. ఈనాడు ప్రత్యక్ష ప్రమాణము చాలా సత్యమైనదని భావిస్తుంటారు. plastic grapes అంతా ఉన్నాయి plastic mangoes ఉన్నాయి plastic bananas ఉన్నాయి. ఇది ప్రత్యక్ష ప్రమాణమే కదా! రూపం కనబడుతోంది కదా! నీవు భుజిస్తున్నావా? కారణమేమిటి? ఆకారమున్నదిగాని దానిసారము లేదు. ఈనాటి experiments ఈ plastic fruits వంటివి. దీంట్లో భగవత్తత్త్వమనే రసము లేకుండా పోతుండాది. దీనికంతా వీరు నిజమని అంగీకరిస్తున్నారంటే ఎంత తెలివితక్కువ వాళ్లో మీరు యోచించండి.

ఇంతేకాదు ప్రత్యక్షంగా కొన్ని చూడటానికి సాధ్యము కానటువంటివి సత్యస్వరూపాన్ని ధరించాయి. ఒక దుఃఖమనుకోండి లేక ఆనందమనుకోండి దీనికి రూపము లేదు. దీనికి ఏదీ ప్రత్యక్షము కాదు. దీనికి రూపం లేదు ప్రత్యక్షం కాదు కాబట్టి నమ్మకూడదంటే నీ నమ్మకంపైని ఆధారపడి ఉంటాయా ఈ దుఃఖ ఆనందములు. నీవు దుఃఖముగా ఉండవచ్చును. నీ మిత్రుడు వచ్చి దుఃఖమునకు ఏమి రూపో చూపండి లేకపోతే నిన్ను నమ్మనంటాడు. "ఒరే పిచ్చివాడా! నీవు నమ్మితే నమ్ము వదలితే వదులు దుఃఖము మాత్రం నన్ను బాధిస్తుండాది. దీనిని ఏరీతిగా చూపటానికి వీలవుతుంది!" అంటావు. ఈ విధముగా విచారణ చేస్తూపోతే తన మనస్సనేది తనకు కనిపిస్తున్నాదా? తన బుద్ధి తనకు కనిపిస్తున్నాదా? ఈ అంతఃకరణ తనకు కనిపిస్తున్నాదా? దీన్ని ఏరీతిగా తాను విశ్వసిస్తున్నాడు. నా మనసు ఎక్కడెక్కడకో పోతుండాది? మనసు కనిపించటం లేదే. దీన్ని ఎట్లు నమ్ముతున్నావు. దీనికంతా అనుభూతులే మూలకారణము. ఈనాటి విద్యలంతా ఈ విధమైన స్థితిలో అభివృద్ధి గావటంచేతనే మానవత్వము మరుగునపడిపోతున్నాది. ప్రతి పదార్థమునందు కూడను మనము పరతత్త్వాన్ని విశ్వసించాలి.

sri sathyasaivachanamrutam

ఈ పరతత్త్వముపైన విశ్వాసము లేని మానవుడు ప్రాకృతమైన జీవితములో వ్యర్థ జీవితము గడపినవాడే.

ఒకానొక సమయములోపల శివాజీ సమర్థ రామదాసునకు కొంత ధనము, కొన్ని వస్తువులు, ఆభరణములు పంపించినాడు. ఇతను నిరంతరము దాన ధర్మములందు కాలము గడిపేవాడు. పవిత్రమైన త్యాగము పూనిన వ్యక్తి. అతను చాలా బీదవాడు. సర్వసంగ పరిత్యాగి. అలాంటి వ్యక్తి మంచికార్యములు చేస్తున్నాడని శివాజీ అంగీకరించాడు. ఆ త్యాగికి ఇలాంటివన్నీ పంపించినప్పుడు తాను ఎంతైనా సద్వినియోగము చేస్తాడు అతడు పాపం అనాథుడని తన పరివారముతో చెప్పి పంపించాడు. వీరంతా పల్లకీలో తీసుకొని వెళ్ళి అతని ఇంటి ముందు దింపారు. సామానంతా ఇంటిలో ఉంచారు. నలుగురు మోసుకొనిపోయి పల్లకీని ముందు పెట్టారు. రామదాసు నది నుండి స్నానం చేసి ఇంటికి వచ్చాడు. అక్కడున్న శివాజీ పరివారమును చూశాడు. 'ఎవరండి మీరు? ఎందుకోసమొచ్చారు. మా ఇంట ఉన్నది ఇద్దరే. మేమిద్దరము క్షేమముగా వున్నాము. నలుగురు మోసుకొనిపోయే ఈ వాహనము ఇక్కడెందుకు తెచ్చారు? అన్నాడు. నలుగురు మోసుకొనిపోయే వాహనమంటే శ్మశానమునకు తీసుకొనిపోయే వేదిక.

అప్పుడు వారు చేతులు జోడించుకొని మహానుభావా! శివాజీగారు పంపినారు ఇక్కడికి. మీరు అనాథులుగా ఉండటం చేత మీరు చేసే కార్యములు చాలా ఉత్తమంగా ఉండటం చేత దానికి తగిన సామగ్రినంతా పంపిరమ్మన్నారు. స్వామి పైకి చూశాడు ఫక్కున నవ్వాడు. 'రామా! నీ యంతటి గొప్ప దేవుడే నాకు గొప్ప నాథుడుగా ఉంటుండగా నేను అనాథుడని ఎట్లా భావించాడు? ఈ శివాజీ. ఇంతగొప్ప జగత్పతియైన భగవంతుడే నా పతిగా ఉండినప్పుడు నేనెట్లా అనాథనౌతాను. సర్వులకు నీవే పతివి. ఒకడెవడైనా అనాథుడున్నాడని విచారణ చేసుకుంటే ఆ అనాథుడవు నీవే అన్నాడు. కారణమేమనగా నీకింకొక నాథుడు లేడు. సర్వజగత్తుకు నీవే నాథుడు. నీవే జగన్నాథుడవు. నీవే లోకనాథుడవు. నీవే ప్రాణనాథుడవు. నీవే దేహనాథుడవు. విశ్వనాథుడవు నీవే. సర్వమునకు నాథుడైన నీవున్నావు. నికింకొక నాథుడు లేడు. కాబట్టి రామా నీవే ఆ అనాథుడవు. కనుక ఈ సామానంతా నీవే తీసుకొని పొమ్మన్నాడు. ఈ విధమైన విశాల భావములు సాధించిన వ్యక్తులు, ప్రపత్తి కలిగిన సాధకులు ఆనాటివారు.

srisathyasaivachanamrutam

**నిర్మలంగా ఉండండి**

ఈనాటి వ్యక్తులలో కేవలము మాటలగారడి తప్ప మనసు ఏమాత్రము పరిపక్వస్థితికి రావటం లేదు. 'మాటలు చూస్తే కోటలు దాటుతాయి, కాలు చూస్తే గడపదాటదు! అన్నాడు. చెప్పవచ్చు కోటి చెయ్యరు ఒకటి." కాని మనము చేస్తున్నామా? Duty devotion భగవంతునికి అర్పితము చెయ్యాలి. devotion ఉండవచ్చు కాని duty ద్యూటిగా చేస్తున్నారా? duty చేయనప్పుడు devotion ఉండి ఏమి ప్రయోజనము. ఒక్కొక్కని ఒక్కొక్కరూమ్ మానిటర్‌గా పెట్టాము. తన రూములో ఉండిన వ్యక్తులంతా ఏడెనిమిది మంది నిన్న భజనకు వచ్చారా! ప్రార్థనకు attend అయినారా తాను చూసుకున్నాడా? ఇక తానేమి duty చేశాడు. ఇలాంటి మానిటర్లే ఈ విధమైన పెడమార్గము పట్టిస్తే ఇంక పిల్లలు ఏవిధముగా అభివృద్ధి కాగలరు. వీనికి చెప్పే అధికారం ఏవిధముగా ఉంటుంది. వీని భక్తి ఎక్కడుంటుండాది? ఈనాడు సీటిచ్చేంతవరకు కాళ్లు వేళ్లు పడతారు. సీటిచ్చిన తరువాత చదువయ్యేంతవరకు తల్లిదండ్రులు, వ్యక్తులు చాలా భక్తి ప్రపత్తులు ప్రదర్శిస్తారు.

చదువు పూర్తి అయిపోయిదంటే నాటకాలు ప్రారంభిస్తారు. మా తండ్రికి ఒళ్లు సరిలేదు. మా తండ్రికి కనుదృష్టి సరిలేదు. పాపం ఎవరూ లేరు. వాళ్లను ఇంటికిపోయి చూసుకోవలసిన బాధ్యత ఉంది. ఈ ప్లాను వేస్తారు. ఇంతకాలము వాళ్ల తండ్రిని ఎవరు చూశారు? నీ చదువయ్యేంతవరకు మాత్రం తండ్రి బాగుండి చదువైపోగానే చెడిపోతాడా? దీనికి తగినట్టుగా తల్లిదండ్రులు కూడను తాళము శృతి. చదువైపోయిన తరువాత అక్కడ వాడెందుకు? ఇక్కడ వచ్చేస్తే ఏ మూడువేలో, నాలుగువేలో, ఐదువేలో సంపాదించేసి మా తలపైన కొడతాడు కదా అనే దురాశతో వారు కూడను ఆ విధముగా ప్లాను. తల్లిదండ్రుల దగ్గర పోకూడదని నేను చెప్పటం లేదు. తల్లిదండ్రుల సేవ చేయవలసినదే. కాని సక్రమమైన మార్గాన్ని అనుసరించి తల్లిదండ్రుల దగ్గర చేరండి. వారి దగ్గర పోవటానికి ఇక్కడ వదలటానికి అసత్యమైన డ్రామాలు మాత్రం ఆడకండి. అది నాకిష్టం లేదు. ఈ విధమైన డ్రామాలాడటమనేది కేవలము భగవద్ద్రోహముగా ఉంటుంది. భక్తి భక్తి అని అనుకుంటున్నారేగాని పిల్లలు చాలామందికి భక్తంటే ఏమిటో అర్థము కావటము లేదు. స్వామికెదురుగా కేవలం సంతృప్తుయ్యేటువంటి డ్రామాలు చేస్తే స్వామి తృప్తి పడతారనుకుంటారు.

**ఒట్టిమాటలు వాడు కాదన్నా ఈ సాయి దేవుడు**
**బుట్ట బొమ్మల చూడ బోదన్నా**
**గట్టు చేర్చు మటన్న వారిని గట్టి ఓడను పట్టి చూడగ**
**పట్టు బట్టలు కట్టి భక్తుల చుట్టు తిరిగే పొట్టి స్వామిని**
**కన్ను విప్పి చూడరోరన్నా.**

ప్రతి చిన్న విద్యార్థి ఈ పెద్ద విద్యార్థులను కలసుకొని పెడమార్గం పడుతున్నారు. శరీరము నందు పెద్దవారే. క్లాసునందు పెద్దవారే. డిగ్రీలందు పెద్దవారే. మరి ఇక్కడ నివాసము చేసిన దానిలో కూడను పది సంవత్సరములు, పన్నెండు సంవత్సరములు పెద్దవారే. ఇప్పుడు చూడండి. అక్కడ శరీరము చూడండి. అతనిని నేను భీముడని పిలుస్తాను. అతనేమన్నా ప్రార్థనకు పోతున్నాడా? అతనొక రూమ్ లీడరు. ఇట్లాంటి వారంతా లీడర్సుగా తయారౌతే ఎంత మంది పిల్లలు పాడైపోతారు. ఇక ఈ క్రమశిక్షణను వీరేమి అభివృద్ధి చేయగలరు? ఈ క్రమశిక్షణయే మాకు ప్రధానమైన subject. ఏ విధంగా మీరు సిగ్గులేకుండా వచ్చి మాట్లాడుతున్నారో నాకర్థము కావటం లేదు. చెప్పటమంతా చాలా గొప్పగా చెప్తారు. ఏమిటి వీడి experience. స్వామికి తృప్తిగానటువంటి experience ఎందుకు?

**నాకు కావలసింది మీలో మార్పు**

ఎవరైనా రిజిష్టరు కవరు వ్రాసి పోస్టు చేసినారంటే అది చేరినట్లా లేదా అనే దానికి ఎక్నాలెడ్జిమెంటు వాపసురావాలి. అది రానప్పుడు ఇది చేరిందా లేదా అని ఏరీతిగా మీరు భావించవచ్చును. తనకు తాను భక్తుడను కోవచ్చును. కానీ నానుంచి రావాలి నీవు భక్తుడవయ్యా అని. ఎక్నాలెడ్జిమెంటు రావాలి. అది రావటమే లేదే. నీవెట్లు భక్తుడవు? అది వచ్చే స్థితిని తెప్పించుకున్నవాడే నిజమైన భక్తుడు. కనుక నా ఉద్దేశ్యమేమంటే రిజిస్ట్రారు, వైస్‌ఛాన్స్‌లరు వీరంతా కూడను ముందు చేయవలసినదేమంటే ఎనిమిది తొమ్మిది సంవత్సరముల నుంచి ఇక్కడఉన్న వారందరిని ఇక్కడ నుంచి పంపించాలి. వారిలో సరియైన వారున్నారు కొంతమంది ఉన్నారు పాపం. వాళ్లను పెట్టుకొని మనం పనులు చేస్తాం. మన డిసిప్లిన్ మన డివోషన్ మన డ్యూటీని అనుసరించినవారే ఇక్కడుండాలి. మా సంస్థ కేవలము ఒక సత్రము కాదు. చావడి

sri sathyasai vachanamrutam

కాదు. ఆదర్శవంతమైన జీవితమును నిరూపించే వ్యక్తులు మాత్రము ఇక్కడుండాలి. ఇంతకాలము ఓపిక పట్టుకున్నాము. మారుతారు మారుతారని ఎంతో ఆశించినాను. మీరింక మారేస్థితిలో లేరు. కనుక ఈ విధముగా మారవలసిందే. ఇంక స్థలాన్ని మార్చవలసిందే. వారికీ సంతృప్తి అవుతుంది. ఎందుకంటే వాళ్ళకు కూడను ఈ వయస్సు వచ్చినప్పుడు ఏదో పాస్ చేసుకున్నాం ఏదో పోస్టుగ్రాడ్యుయేషన్ అయిపోయింది. తరువాత పిహెచ్‌డి డిగ్రీ తీసుకున్నాం. ఇంక కావలసింది ఒక్కటే. ఇంక వాళ్ళ దృష్టి అదే వాళ్ళ ఏకాగ్రత. పెండ్లి కావాలి. ఈ marriage madness తలలో చేరేటప్పటికి వీళ్లకు దేవుడూ కనబడడు దైవము కనబడదు సంతోషము. కానీ తల్లిదండ్రులకైనా సేవ చేయండి. అక్కడ తల్లిదండ్రులకు కాక ఇక్కడ స్వామికి సంతృప్తి కాకుండా తాను సంతృప్తి లేకుండా కేవలం కుక్కలవలె జీవితాన్ని గడుపుకుంటుంటే ఎవరికేమి సుఖము? వాళ్ల దగ్గర నుంచి మేము ఏమాత్రము ఆశించటం లేదు. పి.హెచ్.డి boysకు కూడ మేమే డబ్బు ఇస్తున్నాము. మేమే చదివిస్తున్నాము. ఈ విధముగా ఉంటున్నప్పుడు అలాంటి వాళ్లను ఎందుకిక్కడ పెట్టుకోవాలి. కనుక ఈ విషయములో మాత్రము ఇంకపైన సరియైన కట్టుదిట్టము లేకపోతే సంస్థను మూసి వేయవలసి వస్తుంది. మంచి పిల్లలు తక్కువ మంది ఉండినా చాలును. వారిని పెట్టుకునే మనము కాలము గడుపుకొందాం. నేను సాయంకాలము ప్రతిదినము ఈ విధమైన ఉపదేశాలు చేయాలనుకోవటానికి ఇదే మూలకారణము. పిల్లలతో మాట్లాడించటం, పిల్లలలో ఉన్న దోషాలు పిల్లలకే చూపటం. నిజమైన గురువు ఎవరంటే తన దోషములు తనకు చూపినవాడే నిజమైన గురువు. అతని దోషములను తాను అంగీకరించి మంచివి మంచివని చెప్పి తాను చక్కగా అంగీకరిస్తే ఆ శిష్యులను చాలా చెడగొట్టిన వాడౌతాడు. ఈ discipline అంతా మీ భవిష్యత్తును రాజమార్గమునకు చేర్చేటువంటిది. కానీ అది మీరు గుర్తించుకోటం లేదు. జీవితాన్నే మీరు పతనం చేసుకుంటున్నారు. విద్యార్థులందరు చక్కగా గుర్తించవలసిన విషయము.

ఈ సంస్థయందు నియమించిన నియమములు తుచ నడచుకోవటం ఇష్టమున్నవారు ఉండవచ్చును. లేనివారు వెళ్లవచ్చును. మీకు శ్రమ ఉండదు. కానీ మీ విద్య పూర్తయ్యేంతవరకు మాత్రం మంచిగా అంగీకరించి అనేక రకములుగా ప్రోమిస్‌లు చేస్తారు కాని ఇవన్నీ మిస్ లే. ఒక్కడైనా ప్రోమిస్‌ను నడచుకున్నవాడు లేదు. కొత్తగా భక్తిగా వచ్చిన పిల్లలు ఎంతమందో

srisathyasaivachanamrutam

ఉంటున్నారు పాపం. వారి హృదయాలను వారి భావాలను మీరు అశుద్ధ పరచకండి. వారు నిశ్చల నిర్మల నిస్వార్థమైన భక్తితో ఇక్కడ ప్రవేశించారు. మీరందరు స్వార్థము, స్వప్రయోజనము నిమిత్తమై ఈ డ్రామాలాడుతున్నారు. మీ భావములంతా కూడను ఆ కొత్త విద్యార్థులందు చేరకుండా చూసుకోటానికి ప్రయత్నించండి. ప్రతి మానవునికి భగవద్విశ్వాసమే గాఢముగా ఉంటుంటే ఇలాంటి దుర్భావములు, ఈ దుశ్చేష్టలు వానిలో ప్రవేశించటానికే వీలులేదు. స్వామిపై మీకు నిజమైన ప్రేమనే ఉంటుంటే స్వామి ఆజ్ఞను ప్రాణము పోయినా సరే ఏమాత్రము మార్చకూడదు. దీన్ని బట్టి గుర్తించటానికి వీలౌతుంది ఇది నిజమైన ప్రేమ కాదు. ఇది కేవలము కృత్రిమమైన ప్రేమగా ఉంటుండాది. ఈ కృతిమ ప్రేమస్వామిని ఏమాత్రము వంచించ లేదు. మిమ్మల్ని మీరే వంచిచుకున్న వారౌతారు. నిన్ను నీవు మోసము చేసుకోవద్దు. నీకు నీవు ద్రోహము చేసుకోవద్దు. 'నొప్పించక తానొవ్వక తప్పించుక తిరుగువాడు ధన్యుడు వేమా!' అన్నారు. నష్టపడకుండా, ఇతరులను నొప్పించకుండా నీవూ పతనము కాకుండా ఇతరులు కూడను పతనము కానీయకుండా చూసుకొనే మార్గాన్ని మనము వెథకాలి. కనుకనే 'త్రోవ వెదుకుకొనుట దొడ్డ బుద్ధి' అన్నాడు ప్రహ్లాదుడు. ఏ త్రోవ వెతుక్కోటం. క్రొత్తగా మనం వెదకనక్కర లేదు. వచ్చిన త్రోవ వెదక్కోవటమే. ఎక్కడ నుంచి వచ్చాము? ఆత్మ నుంచి వచ్చాము. తిరిగి ఆ స్థానానికి వెళ్లాలి. అదే త్రోవ మనము చూసుకోవాలి. కానీ ఈనాడు వచ్చిన స్థానము ఒకటి. ప్రయాణం మరొక స్థానానికి పోతున్నాము. కనుకనే మన జీవితం చాలా ఇక్కట్లకు గురైపోతున్నాది. మనం వచ్చిన త్రోవను వెదుక్కోవాలి. ఇదే ఈనాడు మీకిచ్చే ఉపదేశము. ఇది ద్వాదశాక్షర మంత్రము. 'త్రోవ వెతుకు కొనుట దొడ్డ బుద్ధి' పన్నెండక్షరాలు. ఆ ద్రోవను వెదుక్కోండి. ఏ స్వామి దయను మీరు దూరం చేసుకున్నారో, ఏ స్వామి ప్రేమను మీరు దూరం చేసుకున్నారో, ఏ స్వామి మనసును మీరు నొప్పించినారో ఆ ప్రేమను, ఆ దయను, ఆ స్థానమును చేరటానికి తగిన ఇదిని మీరు వెతుక్కోండి.

**ఆడంబరమైన నాటకాలు ఆడకండి**

నాకెప్పుడు unhappy లేదు. Always happy. ఐతే ఈ పిల్లలు ఈ విధముగా పాడౌతున్నారే అనే ఉద్దేశ్యంతో బాధ ఉంటుండాది. happy లేనివారిక÷ happy

sri sathyasai vachanamrutam

అందించండి. అంతేగాని నాకోసం నీ happy నాకక్కర లేదు. అనేకమంది birthday వస్తుంది. Happy birthday happy birthday అంటుంటారు. విదేశీయులంతా పాపం. నేను చెప్తుంటాను. I am always happy. నాకు నీ happy అక్కరలేదు. happy లేని వారికి happy నియ్యండి. ఇప్పుడేం చేస్తున్నారు మీరు? మీ తల్లిదండ్రులకు happy లేదు. మీకు happy లేదు. మీ చుట్టుపరిసరములలో ఉండేవారికి happy లేదు. ఇలాంటి జీవితాన్ని మనం ఎందుకు గడపాలి. ఎక్కడికైనా పోయి మీరు happyగా ఉండండి. తల్లిదండ్రులకు happy నివ్వండి. ఇంతకాలము ఉండినందుకిక్కడ ఈ ఒక్క ఉపకారమైనా మీ తల్లిదండ్రులకు చేయండి. విద్యార్థులందరు చక్కని క్రమశిక్షణ పాటించి చెడ్డను ఒప్పుకోకుండా పెద్దలను గౌరవిస్తూ చిన్నలపైన కరుణ చూపుతూ సరి సమానులపైన సరియైన మైత్రిని మీరు పెంచుకోండి. ఇదే మైత్రి, కరుణ, ముదిత, ఉపేక్ష. ఇవి నాలుగు కూడను చతుర్విధ పురుషార్థములు. ఈ పురుషార్థములను మీరు చక్కగా సార్థకము గావించుకుంటే మీ జన్మయే సార్థకమవుతుంది. కానీ మీరు ఒకరికొకరు సరిసమానమైన వారితో సమానమైన భావాన్ని పెంచుకోండి. ద్వేషాలు పెంచుకోకండి. అసూయాభావాలు పెంచుకోకండి. ఆడంబరమైన నాటకాలు ఆడకండి. అహంకారానికి చోటివ్వకండి. వినయముగా, విధేయతగా ఉండండి. 'విద్యా వినయ సంపన్నే' వినయమనేదే లేదు. ప్రశాంతి నిలయము వచ్చినప్పుడు మాత్రమే దీనిని ప్రదర్శిస్తున్నారు.

నిన్నటి దినము చెప్పటం చేత నిన్నరాత్రి ఎట్లా ఉంది? హాస్టలంతా నిశ్శబ్దంగా ఉంటుండాది. ఈ విధమైన పరిస్థితులు కేవలము ఒకటి రెండు దినములు మాత్రమే. మన discipline ఆ విధముగా ఉండకూడదు. నీ నీడ యే విధముగా నిన్ను వెంటాడుతుందో మన discipline మన వెంటనే ఉంటుండాది. మన నీడ ఒంటరిదిగా ఉంటుండాలి. ఇక్కడ ఉంటుండు. మార్కెట్టుకు పో, బజారుకుపో, ఇంటికిపో, ఇంకెక్కడికైనా పో. నీ shadow నీవెంట వస్తుంటాది కదా! అదేరీతిగా ఈ discipline వెంటనే ఉంటుండాలి. ఇదే సత్యమైన discipline. ఇప్పుడు మీరు ప్రకటించేదంతాకూడను కృత్రిమమైన discipline. నేను ప్రదర్శనను కోరటం లేదు. నిదర్శనను కోరుతున్నాను. కించిత్తైనా సరే. దానికి సరియైన విలువనిచ్చే సారముంటుండాలి. కనుక మీరు మీ

sri sathyasai vachanamrutam

ప్రవర్తనయందు, మీ మాటలయందు, మీ చేష్టలయందు అన్నింటియందు కూడను సరియైన భావాన్ని పెట్టుకోండి. మీరే బాగుపడతారు. ఇదే నిజమైన చదువు. ఈ చదువు లేకుండా కేవలము ప్రాకృతమైన చదువులు ఎన్ని సంపాదించుకున్నప్పటికిని, ఎన్ని చదివినప్పటికిని ప్రయోజనము లేదు. ఏదో ధనమును సంపాదించవచ్చును. ప్రాకృతమైన అనుకూలములు చేసుకోవచ్చును. కానీ మానసిక శాంతి ఎవరిస్తారు? మానవునికి శాంతి అతి ప్రధానమైనది. నిత్యము మీరు భజనలోగాని, ఇంకెక్కడగాని చెప్తూనే ఉంటుంటారు. 'శాంతి శ్శాంతి శ్శాంతిః ' ఈ మూడు తూర్లు చెప్పటంలో ఉండిన అంతరార్థమేమిటి? దేహరీతిగా శాంతి, మనోరీతిగా శాంతి, ఆత్మరీతిగా శాంతి. ఇదే మూడు తూర్లు శాంతి కావాలి. అదికూడా ఏరీతిగా? అదికూడా శాంతిగానే ఉంటుండాలి. శాంతి శాంతిగానే ఉంటుండాలి. శాంతి శాంతి శ్శాంతిః ఇట్లు పోవాలిగాని శ్శాంతి శ్శాంతి శ్శాంతి ఈ శాంతిలో కూడను క్రోధము ఉంటుంటే ఇక శ్శాంతి నీకెక్కడ లభిస్తుంది. కనుక ఈ P.hd పిల్లలందరు తగిన జాగ్రత్తను వహించి క్రమక్రమేణా మీమీ స్థానాలకు పోవటానికి తగిన ఏర్పాట్లు చేసుకోండి. దీనికి ముందు తగిన రీతిగా తగిన చర్య రిజిస్ట్రారు, వైస్ ఛాన్సలర్ తీసుకోవాలి.

**(తేది. 20-06-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam